సాక్షి నారాయణపేట

సోమవారం ၊ 24 ၊ జూన్ ၊ 2024



కనరాని నీళ్లు

జిల్లాలో పారుతున్న కృష్ణ, తుంగభద్ర నదుల్లో నీటి జాడ కనిపించడం లేదు.

వివరాలు 8లో ▸



ముగిసిన మహాయాగం

సింగారం గిరిపీఠంపై నిర్వహిస్తున్న నవచండీ మహాయాగం ఆదివారం ముగిసింది.

వివరాలు 9లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
33.4 /24.1

రోజంతా ఆకాశం మేఘావృతమై ఉంటుంది. సాయంత్రం, రాత్రివేళలో మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ముఖ్యమంత్రిని కలిసిన కలెక్టర్



నారాయణపేట రూరల్: రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఆదివారం జిల్లా నూతన కలెక్టర్ సిక్తా పట్నాయక్ కలిశారు. ఇటీవల హన్మకొండ నుంచి బదిలీపై వచ్చి ఇక్కడ బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఆమె తొలిసారి సీఎంను మర్యాద పూర్వకంగా కలిసి పూల మొక్క అందించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా నారాయణపేట జిల్లాను అన్ని విధాలుగా అభివృద్ధి చేయాలని సూచించినట్లు తెలిపారు. వెనుకబడిన ప్రాంతంగా ఉన్న మచ్చను పూర్తిగా చెరిపివేయడానికి అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని, కావాల్సిన నిధులు సైతం అందిస్తానని తెలిపారు.

నీట్ లీకేజీపై సమగ్ర విచారణ జరిపించాలి



నారాయణపేట రూరల్: నీట్ పరీక్షల్లో జరిగిన అవకతవకలపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో సమగ్ర విచారణ జరిపించి విద్యార్థులకు న్యాయం చేయాలని పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు ఈశ్వర్ డిమాండ్ చేశారు. పట్టణంలోని సీపీఐ ఎంఎల్ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన పీవైఎల్ జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎన్నో ఆశలు, కలలతో నీట్ పరీక్షకు హాజరైన సాధారణ, మధ్య తరగతి విద్యార్థులకు నష్టం జరిగిందని వాపోయారు. పరీక్షలో 67మందికి ఒకే ర్యాంకు రావడం అనుమానంగా ఉందని, పేపర్ లీకేజీలు, కార్పొరేట్ కళాశాలల వికృత చేష్టలతో చాలా మందికి అన్యాయం జరుగుతుందని విమర్శించారు. వెంటనే సమగ్ర విచారణ జరిపించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఉపాధ్యక్షులు సలీం, ఆనంద్, కోషాధికారి రాము, మల్లేష్, రవి, శ్రీను, శ్రీకాంత్ పాల్గొన్నారు.

విజయవాడకు బస్సు సర్వీసు ప్రారంభం

మక్తల్: మక్తల్ నుంచి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విజయవాడకు బస్సు సర్వీసును ఏర్పాటుచేసినట్లు స్థానిక ఆర్టీసీ అధికారులు తెలిపారు. టీఎస్ఆర్టీసీ అధికారుల ఆదేశాల మేరకు ఆదివారం నుంచి బస్సును ప్రారంభించారు. ప్రతిరోజు సాయంత్రం 4 గంటలకు ఈ బస్సు మక్తల్ నుంచి బయల్దేరుతుందని, తెల్లవారు జామున 3 గంటలకు విజయవాడ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణం అర్ధరాత్రి 12 గంటలకు విజయవాడ నుంచి బయల్దేరి అదే రోజు రాత్రికి 9:50 కి మక్తల్‌కు చేరుకుంటుందని అధికారులు ఆంజనేయులు తెలిపారు.

చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి



నారాయణపేట రూరల్: ప్రతీ విద్యార్థి చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని డీఈఓ ఎండీ అబ్దుల్‌ఘని అన్నారు. ఇంటర్నేషనల్ ఒలింపిక్ డే ను పురస్కరించుకుని అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన ర్యాలీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రతిరోజు ఆటలు ఆడటం వల్ల ఆరోగ్యంగా ఉంటామన్నారు. క్రీడలతో శారీకర దృఢత్వంతో పాటు మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. క్రీడల్లో చక్కటి శిక్షణ పొంది ఒలింపిక్స్ వరకు చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఎంఓ విద్యాసాగర్, సెక్టోరియల్ అధికారి శ్రీనివాస్, జీహెచ్ఎం బాలకిష్టప్ప, టీచర్లు జనార్దన్‌రెడ్డి, మల్లికార్జున్, పీఈటీలు అక్తర్‌పాషా, పర్వీన్‌బేగం, నవిత, శ్రీలత పాల్గొన్నారు.

గ్రామీణ క్రీడాకారుల ప్రతిభను వెలికి తీయాలి

మక్తల్: గ్రామీణ ప్రాంతాల క్రీడాకారుల ప్రతిభను వెలికి తీసేందుకు క్రీడా శిబిరాలు ఎంతో ఉపయోగపడతాయని.. విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లోను రాణించాలని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. ఒలింపిక్ దినోత్సవం సందర్భంగా పట్టణంలో శనివారం జిల్లా సైక్లింగ్, షూటింగ్ బాల్, టాగ్‌ఆఫ్ వార్, అథ్లెటిక్స్ సోషియేషన్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే, అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా చైర్మన్ , కార్యదర్శి గోపాలం క్రీడాజ్యోతిని వెలిగించి ర్యాలీ నిర్వహించారు. జాతీయ జెండాలతో పట్టణం అంతా ర్యాలీ నిర్వహించారు.

కోల్డ్‌వార్..

కోస్గి పోలీస్‌స్టేషన్‌ను శాసిస్తున్న ఆ ముగ్గురు



కోస్గి పోలీస్ స్టేషన్

- ఏళ్లుగా ఒకే చోట పాతుకుపోయిన వైనం
- స్టేషన్‌లో అధికారం చెలాయించాలంటే వీరి మద్దతు ఉండాల్సిందే..
- సిబ్బంది అందరూ ఒకవైపు.. ముగ్గురు మరోవైపు
- వీరి ఆగడాలు భరించలేక సెలవుపై వెళ్లిన ఎస్‌ఐ..?
- చర్చనీయాంశమైన ముగ్గురి బాగోతం

కోస్గి: కోస్గి పోలీస్‌స్టేషన్‌లో సిబ్బంది మధ్య కోల్డ్ వార్ నడుస్తోంది. కొన్నేళ్లుగా ఇక్కడే పాతుకుపోయిన ఒకే ప్రాంతం.. ఒకే బ్యాచ్‌కు చెందిన ముగ్గురు సిబ్బంది అంటే పోలీస్ అధికారులకే కాదు మిగిలిన సిబ్బందికి హడల్. సాధారణ బదిలీల్లో వచ్చారో.. లేక వీరే అధికారుల అండదండలతో తమకు అనుకూలమైన విధుల్లో చేరారో కాని ఏళ్లుగా ఇక్కడే పాతుకుపోయారు. ఓ వైపు పోలీస్ ఉద్యోగం చేస్తూనే మరో పక్క ప్రైవేట్ ఫైనాన్స్‌లు ఇవ్వడం, రూ.లక్షల విలువైన చిట్స్ నడుపుతూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. కొత్తగా ఏ అధికారి బాధ్యతలు చేపట్టినా ఆ ముగ్గురి కనుసన్నల్లో పనిచేస్తేనే ఎలాంటి గొడవలు లేకుండా స్టేషన్ ప్రశాంతంగా ఉంటుందనే వాదనలు వినవస్తున్నాయి. వీరిని కాదని కొత్త వారిని ప్రోత్సహిస్తే సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారాలు చేయించడం, స్టేషన్‌లో జరిగే అంతర్గత విషయాలు బయటకు లీక్ చేయడం, ముగ్గురిలో ఒకరైన ప్రత్యేక విధులు నిర్వహించే వ్యక్తి జిల్లా ఉన్నత అధికారుల నమ్మకాన్ని ఒమ్ము చేస్తూ తప్పుడు నివేదికలు ఇచ్చి తమపంతం నెగ్గించుకుంటారనేది స్టేషన్‌లో ఎవరిని అడిగిన చెప్పే బహిరంగ సత్యం. ఇటీవల అసెంబ్లీ ఎన్నికల తర్వాత నూతనంగా విధుల్లో చేరిన ఎస్‌ఐ వీరి ఆగడాలను అడ్డుకోలేకనే సెలవుపై వెళ్లినట్లు స్టేషన్‌తోపాటు బయట బహిరంగ వాదనలు ఉన్నాయి.

వీరి విధులు ప్రత్యేకం

స్టేషన్‌లో ఆ ముగ్గురుగా పేరు పొందిన వారిలో ఒకరు సీఐ కార్యాలయంలో ప్రధాన విధులు నిర్వహిస్తుండగా మరొకరు స్టేషన్ పరిధిలో జరిగే సమగ్ర సమాచారం ఎప్పటికప్పుడు జిల్లా ఉన్నత అధికారులకు అందించేందుకు 'ప్రత్యేకం'గా నియమించబడ్డాడు. మిగిలిన మూడో వ్యక్తి ఎస్‌ఐకి ఎక్కువ సీఐకి తక్కువ అన్నట్లు వీరిద్దరి సహకారంతో స్టేషన్‌లో తాను ఆడిందే ఆట.. పాడిందే పాట అన్న చందంగా హవా చెలాయిస్తున్నారు. అధికారుల తప్పిదమో.. ఆ ముగ్గురికి ఉన్న రాజకీయ అండనో గాని ఒకే ప్రాంతం, ఒకే చోట చదువు, ఒకే బ్యాచ్‌లో ఉద్యోగంలో చేరి ఏకంగా గతకొన్ని సంవత్సరాలుగా ఒకే స్టేషన్‌లో ఆ ముగ్గురు నిర్వహించే విధులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ప్రత్యేకంగా నిలుస్తున్నాయి.

కొత్త ప్రభుత్వం ఏర్పడగానే ఇక్కడ పని చేస్తున్న సీఐ, ఎస్‌ఐలను బదిలీ చేయడంతో కొత్త ఎస్‌ఐగా శేఖర్‌గౌడ్ విధుల్లో చేరారు. పోలీస్ స్టేషన్‌లో వాతావరణం, బయట వాతావరణం చూసుకొని గతంలో ఉన్న ఎస్‌ఐలకు దగ్గరగా ఉన్న కానిస్టేబుల్‌ను కాదని కొత్త వారిని చేరదీయడంతో అసలు యుద్ధం మొదలైంది. కొత్త ఎస్‌ఐ తమను కాదని కొత్త వ్యక్తిని ప్రోత్సహిస్తున్నాడని ఆ ముగ్గురుకి, ఎస్‌ఐకి కోల్డ్‌వార్ మొదలైంది.

భయపడుతున్న ఎస్‌ఐలు..

సోషల్ మీడియాతోపాటు తమకు అనుకూలంగా ఉన్న కొందరితో కలిసి ఎస్‌ఐతోపాటు సదరు కానిస్టేబుల్‌పై తప్పుడు ప్రచారం మొదలెట్టారు. ఇదే విషయంలో ఉన్నతాధికారులకు సైతం తప్పుడు సమాచారం ఇవ్వడంతో ఈ పోరు భరించలేని ఎస్‌ఐ తనను బదిలీ చేయాలని జిల్లా బాస్‌కు విన్నవించాడని సమాచారం. ఎంతకు తనను బదిలీ చేయకపోవడంతో ఏకంగా అనారోగ్యం పేరుతో సిక్ లివ్ పెల్లి వెళ్లాడు. దీంతో ఇక్కడికి ఎస్‌ఐగా రావడానికి ఎవరూ ముందుకు రావడం లేదు. గత నెల రోజులుగా ఎస్‌ఐ లేకుండానే పోలీస్ స్టేషన్ నడుస్తోంది. 15 రోజుల క్రితం వీఆర్ నుంచి స్థానిక పోలీస్ స్టేషన్‌కు వచ్చిన కొత్త ఎస్‌ఐ సైతం చార్జీ తీసుకోవడానికి మొగ్గు చూపడం లేదని స్టేషన్‌లో చర్చించుకుంటున్నారు.

విచారణ చేస్తాం..



కోస్గి పోలీస్ స్టేషన్‌కు సంబంధించి ఎస్‌ఐ తన వ్యక్తిగత కారణాలతో సిక్ లిక్‌లో వెళ్లాడు. కొత్తగా మరో ఎస్‌ఐని పంపించాము. కొత్త ఎస్‌ఐగా వెంకటరమణ నాలుగు రోజుల క్రితమే విధుల్లో చేరాడు. స్టేషన్ అధికారులు, కొందరు సిబ్బందికి మధ్య స్టేషన్‌లో జరుగుతున్న కోల్డ్‌వార్ లాంటిని ఏమి ఉండవు. ఈ విషయంలో అవసరమైతే ఎస్పీ అనుమతితో అంతర్గత విచారణ జరిపి జిల్లా ఉన్నత అధికారికి తెలియజేస్తాం.

– లింగయ్య, డీఎస్పీ, నారాయణపేట

ముకుతాడు పడేనా..?

కొన్నేళ్లుగా స్టేషన్‌ను శాసిస్తున్న ఆ 'ముగ్గురి'పై సమగ్ర విచారణ జరిపి ముకుతాడు వేస్తేనే స్టేషన్‌లో ఎవరి విధులు వారు నిర్వహించుకుంటూ ప్రశాంతంగా ఉంటారని పలువురు పోలీస్ సిబ్బంది అభిప్రాయపడుతున్నారు. గత ప్రభుత్వంలో అప్పటి రాజకీయ నాయకుల అండదండలతో ఆడిందే ఆటగా సాగగా.. తాజాగా ప్రభుత్వం మారడంతో ఈ పార్టీ నాయకులను సైతం మచ్చిక చేసుకొని తమ ఆధిపత్యాన్ని కొనసాగిస్తున్నారు. ఇప్పటికైన జిల్లా ఉన్నత అధికారులు సమగ్ర విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలనే వాదనలు ఉన్నాయి.

మొలచింతలపల్లి ఘటనలో కొత్త కోణం

- చెంచు మహిళపై దాడికి ముందే ఆమె చిన్నమామ నాగన్న అనుమానాస్పద మృతి
- ఈశ్వరమ్మ భూమిని తక్కువ ధరకే కొనుగోలుకు వెంకటేష్ కుటుంబీకుల యత్నం
- భూమి విక్రయానికి అడ్డుపడిన నాగన్న
- మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించకుండా దగ్గరుండి అంత్యక్రియలు చేయించిన వైనం
- తాజాగా దాడి నేపథ్యంలో హత్య చేశారన్న అనుమానాలు.. విచారణ జరపాలని ఎస్పీకి ఫిర్యాదు



జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోతు హుస్సేన్ నాయక్ ఎదుట గోడు వెళ్లబోసుకుంటున్న నాగన్న భార్య లింగమ్మ, చెంచులు

సాక్షి, నాగర్‌కర్నూల్/ కొల్లాపూర్: నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలం మొలచింతలపల్లిలో చెంచు మహిళ కాట్రాజు ఈశ్వరమ్మపై పాశవిక దాడి ఘటనలో మరో కోణం వెలుగులోకి వచ్చింది. ఈశ్వరమ్మపై అదే గ్రామానికి చెందిన బండి వెంకటేష్, శివ కుటుంబీకులు దాడి ఘటనతో ఇటీవల అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన ఆమె చిన్నమామ నాగన్నను హత్య చేసి ఉంటారన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నెల 3న కాట్రాజు నాగన్న(56) అనుమానాస్పద రీతిలో మరణించగా.. పోస్టుమార్టం నిర్వహించకుండానే అంత్యక్రియలు జరిపారు. నాగన్న మృతిచెందిన తీరుపై కుటుంబీకులకు అనుమానాలు ఉన్నప్పటికీ వారి భూమిని కౌలు చేస్తున్న వెంకటేశ్ కుటుంబ సభ్యులు గుట్టుచప్పుడు కాకుండా అంత్యక్రియలు నిర్వహించేలా వారిపై ఒత్తిడి చేశారని చెబుతున్నారు. తాజాగా ఈశ్వరమ్మపై అమానుష దాడి నేపథ్యంలో నాగన్నను హత్య చేశారన్న అనుమానాలు బలపడుతున్నాయి. ఆమెపై జరిగిన దాడి విషయం రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారడం, రాజకీయ, ప్రజా సంఘాల నాయకులు వారికి మద్దతుగా నిలుస్తుండడంతో నాగన్న కుటుంబీకులు పోలీసులను ఆశ్రయించేందుకు ముందుకు వచ్చారు. ఎస్పీ కార్యాలయానికి వెళ్లి నాగన్న మృతిపై విచారణ జరపాలని పోలీసు అధికారులను కోరారు. ఆదివారం మొలచింతలపల్లికి వచ్చిన జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోతు హుస్సేన్‌నాయక్‌కు వివరాలు వెల్లడించారు. ఈ ఘటనపై పూర్తిస్థాయిలో విచారణ జరపాలని హుస్సేన్‌నాయక్ నాగర్‌కర్నూల్ డీఎస్పీ శ్రీనివాస్ యాదవ్‌ను ఆదేశించారు. దాడి, హత్య రెండు ఘటనలు యాధృశ్చికంగా జరిగినవి కావని, భూమికి కోసం జరిగాయని చెంచులు ఆరోపిస్తున్నారు.

ఆరు నెలల క్రితం..

మొలచింతలపల్లి గ్రామం భ్రమరాంబ కాలనీకి చెందిన కాట్రాజు వీరస్వామి, నాగన్న అలియాస్ నాగడు అన్నదమ్ములు. చింతలచెరువు సమీపంలోని సర్వే నం.171లో వంశపారంపర్యంగా వచ్చిన భూమి చెరో 2.5 ఎకరాలు ఉంది. వీరస్వామి భాగానికి వచ్చిన భూమిని అదే గ్రామానికి చెందిన బండి వెంకటేష్ కుటుంబీకులు గత కొన్నేళ్లగా కౌలుకు తీసుకొని సేద్యం చేస్తున్నారు. వీరస్వామి కుమారుడు ఈదన్న ఆయన భార్య ఈశ్వరమ్మలను వెంకటేష్ కుటుంబీకులు ఏడాదికి రూ.30 వేలు చెల్లించేలా ఒప్పందం కుదుర్చుకొని జీతం పెట్టుకున్నారు. భార్యాభర్తలు ఇద్దరూ తమ సొంత పొలంలోనే జీతగాళ్లగా పనిచేస్తూ వచ్చారు. పొలం పనిలేనప్పుడు వెంకటేష్ కుటుంబీకులు నిర్వహించే అక్రమ ఇసుక దందాలో ఇసుక ఫిల్టర్ పనులకు వెళ్లేవారు. ఇంటి వద్ద పనులు కూడా చేసేవారు. వీరస్వామికి చెందిన వ్యవసాయ పొలానికి చిలుకల చెరువు నుంచి నీటి వసతి ఉండడంతో ఎలాగైనా ఆ భూమిని కొనుగోలు చేయాలని వెంకటేష్, శివ భావించారు. ఆరు నెలల క్రితం 2.5 ఎకరాల భూమిని రూ.4.50 లక్షలకు కొనుగోలు చేసేందుకు బేరం కుదుర్చుకున్నారు. బయటి మార్కెట్‌లో ఆ భూమి ధర రూ.25- 30 లక్షల వరకు పలుకుతుంది. ఈ విషయం తెలుసుకున్న నాగన్న కుటుంబీకులు భూ విక్రయానికి అడ్డుపడ్డారు. దీంతో బండి వెంకటేష్ కుటుంబీకులకు, నాగన్న కుటుంబీకులకు మధ్య వివాదం కొనసాగుతోంది. ఈ క్రమంలోనే జూన్ 3న నాగన్న రాయరాసుల పెంటలో ఉండే తన బావ గురువన్న వద్దకు వెళ్లి తిరిగిరాలేదు. రాయరాసుల పెంట సమీపంలోనే ఓ బండ వద్ద నాగన్న చనిపోవడం, అతని ఒంటిపై గాయాలు ఉండటంతో ఎవరో చంపేసి ఉంటారన్న అనుమానంతో పోలీసులకు చెప్పి పోస్టుమార్టం చేయించాలని కుటుంబీకులు భావించారు. అయితే ఆయన అనారోగ్యంతో మరణించాడని, పోస్టుమార్టం వద్దని వెంకటేశ్ తమను సముదాయించినట్లు కుటుంబ సభ్యులు చెబుతున్నారు. నాగన్నను భూమి కోసమే వెంకటేష్, శివ కుటుంబీకులే హత్య చేశారని ఆరోపిస్తున్నారు. వారి నుంచి తమకు ప్రాణహాని ఉందని, పోలీసులే రక్షణ కల్పించాలని, భూములు కాపాడాలని కోరారు.

గతంలోనూ దాడి..

చెంచు మహిళ ఈశ్వరమ్మపై గతంలోనూ నిందితులు దాడికి పాల్పడినట్లు తెలిసింది. ఈశ్వరమ్మను కొడుతూ కారం చల్లుతున్న వీడియో తాజాగా వెలుగులోకి వచ్చింది. ఈ వీడియోలో ఈశ్వరమ్మ చిన్న మామ నాగన్న కూడా కనిపిస్తుండటంతో గతంలో ఆమెను కొడుతున్న సందర్భంలో సదరు వీడియో తీసినట్లు తెలుస్తోంది. ఈశ్వరమ్మపై పలుమార్లు దాడులకు పాల్పడిన నిందితుల కుటుంబ సభ్యులు అందరిపై చర్యలు తీసుకోవాలని బాధితులు డిమాండ్ చేస్తున్నారు.

చెంచులకు రక్షణ కల్పించండి

కొల్లాపూర్/ నాగర్‌కర్నూల్: 'అటవీ ప్రాంతాల నుంచి జనావాసాల్లోకి చెంచులను తీసుకువచ్చారు. వారికి అన్ని రకాల వసతులు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. వారికి ఇచ్చిన భూములను బలవంతంగా ఇతరులు లాక్కుంటున్నారు. భౌతిక దాడులకు దిగుతున్నారు. వెట్టిచాకిరీ చేయించుకుంటున్నారు. రెవెన్యూ, పోలీసుల ఉదాసీనతే ఇందుకు కారణం. చెంచులకు రక్షణ కల్పించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలి'' అని జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోతు హుస్సేన్ నాయక్ అధికారులను ఆదేశించారు. చెంచు మహిళ ఈశ్వరమ్మపై జరిగిన దాడి ఘటనపై విచారించేందుకు గాను ఆదివారం కొల్లాపూర్ మండలం మొలచింతలపల్లిలో ఆయన పర్యటించారు. ఈశ్వరమ్మ నివసించే గుడారం, కూలిపోయిన ఇల్లు, దాడి జరిగిన ప్రాంతాలను పరిశీలించారు. ఆమె కుటుంబీకులు, చెంచులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు.

❐ జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఈశ్వరమ్మను కలెక్టర్ బదావత్ సంతోష్‌తో కలిసి హుస్సేన్‌నాయక్ పరామర్శించారు. మెరుగైన చికిత్స వైద్యం కోసం నిమ్స్‌కు తరలించాలని అధికారులను ఆదేశించారు.

నిందితులను అరెస్టు చేయాలి



నారాయణపేటలో రాస్తారోకో చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

- జిల్లా కేంద్రంలో ప్రజాసంఘాల నాయకుల రాస్తారోకో

నారాయణపేట రూరల్: మండలంలోని కోటకొండ గ్రామంలో గత రెండు రోజులుగా జరిగిన దాడులకు సంబంధించి నిందితులను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని కోరుతూ ఆదివారం నారాయణపేటలో రాస్తారోకో చేపట్టారు. రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన పోలీసులు పట్టించుకోవడంలేదని ఆరోపిస్తూ ప్రజాసంఘాల నాయకులు స్థానిక అంబేద్కర్ సర్కిల్‌లో దాదాపు గంటన్నర పాటు రోడ్డుపై బైఠాయించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ జాతర కమిటీ అధ్యక్షులు, కౌన్సిలర్ మహేష్, అంబేద్కర్ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షులు వెంకటేష్, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి హన్మంతు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి బలరాం, వెంకట్రామారెడ్డి, రైతు సంఘం కన్వీనర్ అంజయ్యగౌడ్, ఎమ్మార్పీస్ జిల్లా జిల్లా అధ్యక్షులు కర్రెప్ప తదితరులు మద్దతుగా నిలిచారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో దళితులపై దాడులు సరికాదని, కేసు విషయంలో పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం అనుమానాలకు దారిస్తుందన్నారు. ఇంత అనాగరికంగా ప్రవర్తించినా పోలీసులకు చీమ కుట్టినట్లు కూడా లేదా అని ప్రశ్నించారు. రూరల్ పీఎస్‌కు వెళ్తే ఎస్‌ఐ అందుబాటులో లేదని వాపోయారు. నిందితులపై 307 సెక్షన్ హత్యాయత్నంతో పాటు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు పెట్టాలని డిమాండ్ చేశారు.

పోలీసులతో వాగ్వాదం..

రాస్తారోకో చేస్తున్న ప్రజా సంఘాల నాయకులతో పోలీసులకు వాగ్వాదం చోటుచేసుకుంది. రోడ్డుపై అడ్డంగా బైఠాయించడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బంది కలగడంతో వారికి ధర్నా విరమించాలని కోరగా నిరాకరించారు. ఈ సమయంలో ఇరు పక్షాలకు మధ్య మాటల యుద్ధం నడిచింది. నిందితుల కోసం గాలింపు ముమ్మరం చేయిస్తామని, వారిని అరెస్టు చేస్తామని ఫోన్‌లో ఎస్పీ యోగేష్‌గౌతమ్ హామీ ఇవ్వగా రాస్తారోకో విరమించారు. శ్రీనివాస్, గజలప్ప, వెంకటేష్, నరేష్, పాండు, హన్మంతు, రాజు, నిరంజన్, లాలప్ప, అశోక్, బాలకృష్ణ పాల్గొన్నారు.

విద్యుదుత్పత్తికి అంతా సిద్ధం

జూరాలలో 12 యూనిట్లు.. 474 మెగావాట్లు

- ఈ ఏడాది లక్ష్యం 600 మిలియన్ యూనిట్లు
- గతేడాది ఉత్పత్తి కేవలం 212 మి.యూ. మాత్రమే..
- ఎగువ కర్ణాటక నీటిపైనే ఆధారం
- మూడో యూనిట్‌లో సాంకేతిక లోపం

ఆత్మకూర్: ఉమ్మడి జిల్లాలోని ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు జల విద్యుత్ కేంద్రాల్లో పూర్తిస్థాయిలో విద్యుదుత్పత్తి చేపట్టేందుకు అధికారులు అంతా సిద్ధం చేశారు. గతేడాది వర్షాభావ పరిస్థితులు, ఎగువ నుంచి ప్రాజెక్టుకు వరద రాకపోవడంతో 640 మి.యూనిట్లు లక్ష్యానికిగాను కేవలం 212 మి.యూ. మాత్రమే ఉత్పత్తి చేశారు. ప్రాజెక్టు ప్రారంభం నుంచి ఇంత తక్కువ మొత్తంలో విద్యుదుత్పత్తి గతేడాదే కావడం విశేషం. 2022-23లో ప్రాజెక్టుకు వరద అధిక మొత్తంలో చేరడంతో ప్రాజెక్టు చరిత్రలోనే అత్యధికంగా 876 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తి చేపట్టి రికార్డు సృష్టించారు. 2020-21 ఆర్థిక సంవత్సరంలో 648 మి.యూ. లక్ష్యానికిగాను 775 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తిని విజయవంతంగా చేపట్టారు. 2021-22లో 724 మి.యూ. లక్ష్యానికిగాను 704 మి.యూ. సాధించారు.



జెన్‌కో స్విచ్‌యార్డు

అందరి సహకారంతోనే..



సిబ్బంది సహకారంతో ఎగువ, దిగువ జల విద్యుత్ కేంద్రాల్లో లక్ష్యానికి మించి విద్యుదుత్పత్తి చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నాం. మొత్తం 12 యూనిట్లు ఉండగా.. మూడో యూనిట్‌లో సాంకేతిక లోపం తలెత్తింది. మిగిలిన 11 యూనిట్ల నుంచి విద్యుదుత్పత్తి చేపట్టేందుకు అంతా సిద్ధం చేశాం. గతేడాది వర్షాభావ పరిస్థితుల కారణంగా 640 మి.యూ. లక్ష్యానికిగాను 212 మి.యూ. మాత్రమే ఉత్పత్తి చేశాం. ఈ ఏడాది ఎగువ నుంచి వరద వచ్చిన వెంటనే విద్యుదుత్పత్తి ప్రారంభిస్తాం. – కల్లూరి రామసుబ్బారెడ్డి, ఎస్ఈ, జెన్‌కో

వరదనీటిపైనే ఆధారం..

జూరాల ప్రాజెక్టుకు ఎగువనున్న కర్ణాటకలోని ఆల్మట్టి, నారాయణపూర్ డ్యాంల నుంచి వరద వచ్చి చేరితేనే విద్యుదుత్పత్తికి ఆస్కారం ఉంటుంది. ఈ ఏడాది మహారాష్ట్ర, కర్ణాటకలో వర్షాలు మోస్తారుగా కురుస్తున్నప్పటికీ అక్కడి ప్రాజెక్టులు నిండిన తర్వాతే దిగువకు నీటిని వదులుతారు. ఇక్కడ వరణుడు మోహం చాటేయడంతో ఎగువ ప్రాజెక్టులపైనే ఆధారపడాల్సిన పరిస్థితి నెలకొంది.

ఏడాది వారీగా విద్యుదుత్పత్తి ఇలా.. (మిలియన్ యూనిట్లలో..)


సంవత్సరం	ఎగువ విద్యుత్ కేంద్రం	దిగువ విద్యుత్ కేంద్రం
2014-15	225	-
2015-16	316	45
2016-17	213	177
2017-18	217	206
2018-19	166	154
2019-20	301	305
2020-21	370	405
2021-22	335	369
2022-23	450	426
2023-24	101	111
2024-25 (లక్ష్యం)	300	300

మూడోయూనిట్‌లో సాంకేతిక లోపం..

ఎగువ జూరాల జల విద్యుదుత్పత్తి కేంద్రంలో ఆరు యూనిట్లు ఉండగా.. మూడో యూనిట్‌లో సాంకేతిక లోపం తలెత్తడంతో ఐదు యూనిట్ల నుంచే విద్యుదుత్పత్తి చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు. గతేడాదే మూడో యూనిట్‌లో సాంకేతిక సమస్య తలెత్తగా ఉన్నతాధికారుల ద్వారా సంబంధిత కంపెనీకి సమాచారమిచ్చారు. కాగా నిపుణులు చైనా నుంచి రావాల్సి ఉండటంతో ఆలస్యమవుతున్నట్లు సమాచారం. ఈ ఏడాది కూడా ఆ యూనిట్‌లో విద్యుదుత్పత్తి జరగకపోవచ్చని అధికారులు భావిస్తున్నారు.

విద్యుదుత్పత్తి వివరాలిలా..

ప్రాజెక్టు దిగువ జల విద్యుత్ కేంద్రంలో 6 యూనిట్ల ద్వారా 240 మెగావాట్లు, ఎగువ జల విద్యుత్ కేంద్రంలోని 6 యూనిట్ల ద్వారా 234 మెగావాట్ల విద్యుదుత్పత్తి చేపట్టడమే లక్ష్యంగా అధికారులు ఏర్పాట్లు చేశారు. 2014-15 నుంచి 2023-24 వరకు 4,892 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తి చేపట్టారు.



దిగువ జూరాల జల విద్యుత్ కేంద్రం

క్లుప్తంగా

పాము కాటుకు బాలుడు మృతి


ఉదయ్‌కుమార్ (ఫైల్)

మానవపాడు: పాము కాటుకు బాలుడు మృతి చెందిన ఘటన మండలంలోని పెద్దఆముదాపాడులో చోటుచేసుకుంది. ఎస్‌ఐ చంద్రకాంత్ వివకాల ప్రకారం.. గ్రామానికి చెందిన బోయ సుంకన్న చిన్న కుమారుడు ఉదయ్‌కుమార్(4) బుధవారం వారి ఇంట్లో నిద్రిస్తుండగా పాముకాటుకు గురయ్యాడు. వెంటనే మండల కేంద్రంలోని పీహెచ్‌సీకి తరలించగా, డాక్టర్ల సూచన మేరకు కర్నూల్ తరలించారు. ఆదివారం మధ్యాహ్నం బాలుడు మృతి చెందాడు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

చేపలవేటకు వెళ్లి వ్యక్తి..

రాజాపూర్: చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి చెందిన ఘటన ఆదివారం మండలంలోని మోతిఘనాపూర్‌లో చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన జహంగీర్(50) వృత్తిరీత్యా గ్రామంలో ఇళ్లకు పెయింటింగ్ చేసేవాడు. ఆదివారం గ్రామశివారులో ఉన్న పెద్ద చెరువులో చేపలవేటకు వెళ్లి చెరువులో మునిగిపోయాడు. గమనించిన స్థానికులు వెంటనే వెతికి బయటికి తీశారు. అప్పటికే మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

విద్యుత్‌షాక్‌తో నెమలి

మానవపాడు: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో ఆదివారం ఓ నెమలి మృతిచెందింది. పోలీసుల వివరాల మేరకు.. ఎస్సీ కాలనీలోకి వచ్చిన నెమలి విద్యుదాఘాతానికి గురై అచేతన స్థితికి చేరుకుంది. గమనించిన స్థానికులు నెమలిని పోలీసులకు అప్పగించేందుకు స్టేషన్‌కు తీసుకువస్తుండగా, మార్గంమధ్యలో మృతిచెందింది. విషయాన్ని ఫారెస్టు అధికారులకు తెలియజేయగా.. వారు పోలీస్‌స్టేషన్‌కు చేరుకొని స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

బిడ్డలతో సహా తల్లి అదృశ్యం


నీలమ్మ


లలిత


కేటీ దొడ్డి: బిడ్డలతో సహా తల్లి అదృశ్యమైన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. ఎస్‌ఐ శ్రీనివాసరావు వివరాల మేరకు.. కేటీదొడ్డి మండలం పూజారితండాకు చెందిన నీలమ్మ శుక్రవారం తన కూతురు లలిత, కుమారుడు తిరుపతితో కలిసి ఇంటి నుంచి బయటికి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు వెతికినా ఫలితం లేకపోయింది. నీలమ్మ తల్లి అవమ్మ ఫిర్యాదు మేరకు ఆదివారం మిస్సింగ్ కేసు నమోదు చేసి, దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. వీరి ఆచూకీ తెలిసిన వారు 87126 70292 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు.

కేసు నమోదు

దేవరకద్ర: కాంగ్రెస్ నాయకుడిపై బీజేపీకి చెందిన ముగ్గురు దాడిచేసి తీవ్రంగా గాయపర్చిన ఘటన శనివారం అర్ధరాత్రి మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ నాగన్న కథనం మేరకు.. పట్టణంలోని రోహిణీ దాబా దగ్గర భోజనం చేయడానికి వచ్చిన యూత్ కాంగ్రెస్ నాయకుడు బోయ ప్రకాశ్‌పై పాత కక్షలతో బీజేపీకి చెందిన వీరేష్ అలియాస్ వీరారెడ్డి, రాజు, చింటు గొడవకు దిగారు. ఈ క్రమంలో వీరారెడ్డి తన వద్ద ఉన్న బీరు సీసాను పగులగొట్టి ప్రకాశ్‌పై దాడిచేసి తీవ్రంగా గాయపర్చారు. ప్రకాశ్ ఫిర్యాదు మేరకు ముగ్గురిపై హత్యాయత్నం కేసు నమోదు చేశారు.

కానరాని నీళ్లు..

సరైన వర్షాలు లేక కళతప్పిన కృష్ణ, తుంగభద్ర నదులు


పూర్తి స్థాయిలో నీరు రాకపోవడంతో రాళ్లు తేలిన కృష్ణానది

- ఎగువ నుంచి వరద రాకపోవడంతో వట్టిపోయిన వైనం
- రెండు నదులపై ఆధారపడి వేల ఎకరాల్లో పంటల సాగు
- ఏరువాక ముగిసినా ఏర్లు పారకపోవడంతో రైతుల ఆందోళన


ఎగువ నుండి తుంగభద్రకు నామమాత్రంగా రాగా.. సుంకేసుల డ్యాం వద్ద నిల్వ నీరు

రాజోళి: నాడు..ఏరువాక కంటే ముందే విస్తారంగా వర్షాలు కురవడంతో నదులు జలకళతో కళకళలాడేవి. నడిగడ్డలో ఏరు ముందా ఏరువాక ముందా.. అనే విధంగా వ్యవసాయం సాగేది. నేడు.. రెండు రోజుల్లో(శనివారం) ఏరువాక పౌర్ణమి పండుగ ఉన్నా చినుకు జాడే కరువైంది. జీవనదిగా పిలవబడే కృష్ణమ్మలో రాళ్లు తేలియాడుతుంటే, తుంగభద్ర నదిలో ఇసుక తిన్నెలు మాత్రమే కనిపిస్తున్నాయి. నీటి జాడ కరువైంది. దీంతో రైతులు తమ సాగుపై తీవ్రంగా ఆవేదన చెందుతున్నారు. పోటీ మీద విత్తనాలు వేసే రైతులు చతికిలపడ్డారు.

రెండు నదులు.. రెండు నియోజకవర్గాలు

జిల్లాలోని గద్వాల, అలంపూర్ నియోజకవర్గాలల్లో రెండు నదుల కింద రెండు నియోజకవర్గాలకు చెందిన రైతులు వ్యవసాయం చేస్తున్నారు. ఈ క్రమంలో రైతులు ప్రతి ఏటా నది నీళ్లపై ఆధారపడి ఎక్కువగా వరి పంటను సాగు చేస్తున్నప్పటికీ, ఈ సమయానికి మాత్రం పత్తి, కంది లాంటి పంటలు వేసేవారు. గత ఏడాది ఏరువాకకు నదుల్లో నీరు రాకపోయినా కొద్దిగా ఆలస్యంగానైనా నదుల్లోకి నీరు వస్తే సాగుకు ఇబ్బందులు ఉండవని తలిచిన రైతులకు నిరాశే మిగిలింది. ఈ ఏడాది అనుకూల వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ చెప్పినప్పటికీ.. నడిగడ్డలో నేటికి ఇంకా సరైన వర్షాలు కురవడం లేదు. గతంలో వర్షాలు తక్కువ మొత్తంలో కురిసినా, నదిలో నీటితో కొద్దిమేర పంటలు సాగయ్యేవి. ఏరువాక పండుగ కంటే ముందు కురిసిన వర్షాలతోనే, నదిలో ఉండే నీటితోనే నడిగడ్డలో విత్తనాలు ధైర్యంగా వేసుకునే రైతులు నేటికి వర్షాలు అనుకున్న స్థాయిలో కురవకపోవడంతో ఆందోళన చెందుతున్నారు,

ఎగువ ప్రాంతాల్లో సైతం

మన ప్రాంతంలో సరైన వర్షాలు కురవకపోయినా ఎగువన ఉన్న కర్ణాటక ఆపై ప్రాంతాల్లో కురిసే వర్షాల కారణంగా నదులకు వరద నీరు వచ్చి చేరేది. కానీ ఈ ఏడాది ఎగువ నుండి వరద నీరు ఎక్కువగా రాకపోవడంతో నదులు ఒట్టిపోయి కనిపిస్తున్నాయి. తుంగభద్ర నది కింద అయిజ, వడ్డేపల్లి, రాజోళి, ఉండవెల్లి, మానవపాడు,అలంపూర్ మండలాలకు సంబంధించి వేలాది ఎకరాలు ఆయకట్టు ఉండగా, కృష్ణా నది కింద గద్వాలతో పాటుగా, నెట్టెంపాడులోని చెరువులు, రిజర్వాయర్లు వాటి కింద ఆయకట్టు, ధరూర్, ఇటిక్యాల మండలాల్లో వేలాది ఎకరాలు ఆయకట్టు ఉంది. ఖరీఫ్ సీజన్ ప్రారంభంలో సాగు తక్కువగానే మొదలైనప్పటికీ, నదుల్లో వచ్చే వరదను ప్రామాణికంగా తీసుకుని రైతులు నది కింద సాగు చేస్తుంటారు. మరికొందరు కౌలుకు తీసుకుంటారు. ఇలా నదుల వల్ల ప్రణాళికాబద్ధంగా జరిగే సాగు కు ఏరువాక పౌర్ణమి పండుగలోపు నిర్ణయాలు జరిగిపోయేవి. ఈ ఏరువాక వస్తున్న నదుల్లో నీరు రాకపోవడంతో అంతంత మాత్రంగా సాగుతుందని రైతులు అంటున్నారు. గత ఏడాది మొత్తానికే నష్టపోయామని, ఈ ఏడాది వర్షాలు వస్తాయని తెలిసి ఎదురుచూస్తున్నా కూడా నిరాశ తప్పడం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. కాని రైతులు మాత్రం కొద్ది ఆలస్యంగానైనా సమృద్ధిగా వర్షాలు కురిసి నదులకు వరద వచ్చి ఆయకట్టుకు జీవం పోస్తుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ఈ సమయానికే నీరు పారేది



గతంలో విస్తారంగా వర్షాలు కురవడంతో నదులు నిండుగా పారేవి. దీంతో ఏరువాక పండుగను ఘనంగా చేసుకుని విత్తనాలు నాటేవాళ్లం. మన దగ్గర వర్షాలు కురవకపోయినా, నదిలో నీరు వేల ఎకరాలకు ఆయువుగా ఉండేది. కానీ ఏడాది వర్షాలు ఉన్నాయని అధికారులు చెబుతున్నప్పటికీ... నదుల్లో నీటి ప్రవాహం లేదు. చాలా మంది విత్తనాలు వేసేవారు. నదుల్లో నీరు రాకపోవడంతో మరి కొందరు వాయిదా వేసుకున్నారు. నది తీర గ్రామాల్లోనే పరిస్థితి ఇలా ఉంటే మిగతా చోట్ల రైతుల పరిస్థితి ఎలా ఉంటుందో అర్థమవుతుంది.

– చింతల సుబ్బారావ్, రైతు, శాంతినగర్

ఏరువాక అంటేనే నదుల పండుగ



ఏరువాక పౌర్ణమి నడిగడ్డలో ఘనంగా జరుపుకొంటారు. ఏరువాక పౌర్ణమి పండుగ కంటే ముందు రెండు నదులు బాగా ప్రవహించేవి. నదికి పూజలు చేసి, ఏరువాక పండుగను కూడా ఘనంగా జరిపేవాళ్లం. గత కొన్నేళ్లుగా ఏరువాక వచ్చినా కూడా ఏరు ప్రవహించడం లేదు. గత ఏడాది మరి దారుణంగా ఉంది. ఈ ఏడాది కూడా తుంగభద్రలో నామమాత్రంగా నీరు పారుతుంటే, కృష్ణ నదిలో స్నానం చేసేంతంగా నీరు ప్రవహిస్తుంది. ఏరువాక పౌర్ణమి ప్రత్యేకత అంటేనే నదిలో జలకళ ఉంటే ఆ పండుగకు మరింత విశిష్టత ఉంటుంది.

– కిష్టన్న, రైతు, రాజోళి

ఉన్నత విద్య.. మిథ్య!



అలంపూర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల

పదో తరగతి తర్వాత ఆపేస్తున్న విద్యార్థులు

- జిల్లాలో జూనియర్, డిగ్రీ కళాశాలల కోసం ఏళ్లుగా పోరాటం
- 12 మండలాల్లో ఏడింటిలోనే జూనియర్ విద్య
- జిల్లా మొత్తంలో మూడు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు
- రాష్ట్ర సరిహద్దు ప్రాంతమైన అలంపూర్‌లో కలగానే డిగ్రీ కళాశాల
- ఉమ్మడి జిల్లాలో డిగ్రీ కళాశాల మంజూరుపై మరోసారి చర్చ

అలంపూర్: ఉన్నత విద్య అయిన ఇంటర్.. డిగ్రీ ప్రభుత్వ కళాశాలలు ఏర్పాటు చేయాలని.. వేలాది గ్రామీణ విద్యార్థుల చదువులు మధ్యలో ఆగిపోకుండా చూడాలని.. ఉన్నత విద్యకు బాటలు వేయాలని జిల్లా ప్రజలు ఏళ్లుగా పోరాటాలు.. ఎందరికో వినతులు ఇచ్చినా లాభం లేకుండా పోయింది. ప్రభుత్వ ఇంటర్, డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేయకపోవడంతో పాఠశాల స్థాయి దాటిన విద్యార్థులకు ఆపై విద్య చదువుకునే అవకాశం.. ఆర్థిక స్థోమత లేక అక్కడితోనే చదువుకు ముగింపు పలికే దుస్థితి నెలకొంది. రాష్ట్ర ప్రభుత్వం ఉమ్మడి జిల్లాలోని ఓ నియోజకవర్గానికి డిగ్రీ కళాశాల మంజూరు చేస్తూ ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. కానీ రాష్ట్రానికి సరిహద్దుగా ఉన్న అలంపూర్‌కు డిగ్రీ కళాశాల మంజూరు చేయకపోవడంతో మరోసారి విద్యార్థులు ఆందోళనలు వ్యక్తం చేస్తున్నారు.

అందని జూనియర్ విద్య

జిల్లాలో ఇప్పటికి అనేక మండలాల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు అందుబాటులోకి రాలేదు. ప్రత్యేక రాష్ట్రం తర్వాత కొత్తగా నాలుగు మండలాలు ఆవిర్భవించాయి. కానీ ఇప్పటికి పాత మండలాలతోపాటు కొత్త వాటిలో 5 మండలాల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఏర్పాటు కాలేదు. ప్రస్తుతం జిల్లాలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు 8, సోషల్ వెల్ఫేర్ జూనియర్ కళాశాలలు 6, కేవీజీవీల్లో ఇంటర్ కళాశాలలు 6, టీఎస్ఆర్‌జేసీ 1, టీఎంఆర్‌జేసీ 2, బీసీ వెల్ఫేర్ 4, ట్రిబల్ వెల్ఫేర్ 1, ప్రైవేటు కళాశాలలు 15 మొత్తం 43 జూనియర్ కళాశాలలు ఉన్నాయి. వీటిలో అత్యధికంగా వెల్ఫేర్‌కు సంబందించి ఉన్నాయి. ఇప్పటికి రాజోళి, కేటిదొడ్డి, వడ్డేపల్లి, ఇటిక్యాల, ఉండవెల్లిలో జూనియర్ కళాశాలలు ఏర్పాటు చేయలేదు.

అలంపూర్, రాజోళికి తప్పని నిరీక్షణ

జిల్లా వ్యాప్తంగా మూడు ప్రభుత్వ, 10 ప్రైవేటు కళాశాలు ఉన్నాయి. ప్రస్తుతం ఉన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల్లో విద్యను అభ్యసించడానికి కొన్ని మండలాల్లోని గ్రామాల విద్యార్థులకు కనీసం 30 కి.మీ నుంచి 50 కి.మీ దూరం రాకపోకలు సాగించాల్సి వస్తోంది. రవాణా వ్యవస్థ సరిగా లేకపోవడంతో చాలా మంది డిగ్రీ చదివే అవకాశం లేకుండా పోతుంది. అలంపూర్‌లో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని నెలరోజుల పాటు ధర్నాలు, దీక్షలు చేపట్టారు. కానీ ఫలితం మాత్రం దక్కలేదు. అలాగే, రాజోలికి చెందిన విద్యావేత్తలు తమ మండలంలో జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. గత ప్రభుత్వంలోనూ ప్రస్తుతం ఉన్న మంత్రులను కలిసి తమ సమస్యను విన్నవించి వినతులు అందజేశారు. ఇదిలాఉండగా, రాష్ట్ర సరిహద్దుగా ఉన్న అలంపూర్ నియోజకవర్గంలోని ఆయా మండలాల విద్యార్థులు ఉమ్మడి రాష్ట్రంలో కర్నూలులోని విద్యాలయాల్లో ఉన్నత విద్యను అభ్యసించే అవకాశం ఉండేది. ఆయా గ్రామాల నుంచి బస్సు సౌకర్యం ఉండటంతో అనేక మంది ఇంటర్, డిగ్రీ ఇతర ఉన్నత విద్య కర్నూలులోనే కొనసాగించేవారు. రాష్ట్ర విభజన తర్వాత సరిహద్దులో ఉన్న ఈ ప్రాంత విద్యార్థులు ఉన్నత చదువులకు కర్నూలుపై ఆధారపడితే లోకల్ నాన్‌లోకల్ సమస్య తలెత్తుంది. ఇప్పటికైనా జిల్లాలో ఇంటర్, డిగ్రీ కళాశాలలు మంజూరు చేసి ఉన్నత విద్యకు బాటలు వేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ప్రతిపాదనలు చేశాం



జిల్లాలో ఇంటర్ కళాశాలల ఏర్పాటు కోసం రాజోలి, వడ్డేపల్లి నుంచి వినతులు వచ్చాయి. ఈమేరకు ప్రతిపాదనలు చేశాం. ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకు ఎలాంటి సమాచారం రాలేదు. ఇతర ప్రాంతాల నుంచి వినతులు వస్తే వాటిని ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్తాం.

– హృదయరాజు, ఇంటర్ విద్య జిల్లా అధికారి

డిగ్రీ కళాశాలలకు తప్పని నిరీక్షణ

జిల్లాలో రెండు నియోజకవర్గాలు, 12 మండలాలు ఉన్నాయి. కొత్తగా ఎర్రవల్లి మండలం ఆవిర్భవించింది. కానీ ప్రభుత్వానికి చెందిన డిగ్రీ కళాశాలలు ఇప్పటికి మూడే ఉన్నాయి. అవి జిల్లా కేంద్రమైన గద్వాలలో ఎంఎల్‌డీ డిగ్రీ కళాశాల, ప్రభుత్వ మహిళా కళాశాల, వడ్డేపల్లి మండలం శాంతినగర్‌లో డిగ్రీ ప్రభుత్వ కళాశాల ఉంది. అయిజ, ఉండవెల్లి, గద్వాల, వడ్డేపల్లి మండలాల్లో 10 వరకు ప్రైవేటు డిగ్రీ కళాశాలలు ఉన్నాయి. నియోజకవర్గ కేంద్రమైన అలంపూర్‌లో ఇప్పటికి కేవలం ప్రభుత్వ జూనియర్ కళాశాల మాత్రమే విద్యార్థులకు అందుబాటులో ఉంది. డిగ్రీ కళాశాల ఏర్పాటు కలగానే మారింది. ఉమ్మడి జిల్లాలో ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం డిగ్రీ కళాశాలల ఏర్పాటుకు ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో జిల్లాలోని పలు ప్రాంతాల్లో డిగ్రీ, ఇంటర్ ఇళాశాలలు ఏర్పాటు చేయాలని ఉద్యమాలు చేపట్టారు. కానీ ఒకటి కూడా మంజూరు కాకపోవడంతో జిల్లా వాసులు నిరాశ చెందుతున్నారు. జిల్లాలో అనేక ప్రాంతాల్లో డిగ్రీ కళాశాలలు ఏర్పాటు అవశ్యకత ఉంది.

డీఐఈఓను సస్పెండ్ చేయాలి


ఓ ప్రైవేట్ కళాశాల ఎదుట ఆందోళన చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా ఇంటర్మీడియట్ శాఖ అధికారి శ్రీధర్ సుమన్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి. జిల్లాకేంద్రంలోని ఓ ప్రైవేట్ కళాశాల ఎలాంటి అనుమతులు లేకుండా నిర్వహిస్తున్నారని, కళాశాల వద్ద ఎస్ఎఫ్ఐ, ఎస్ఎస్‌యూఐ, పీడీఎస్‌యూ, ఏఐఎస్ఎఫ్ తదితర విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కళాశాల అంతస్తులో హాస్టల్ నిర్వహిస్తున్నారని, దీని వల్ల అగ్నిప్రమాదాలు జరిగితే విద్యార్థుల ప్రాణాలకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని డీఐఈఓకు ఫోన్ ద్వారా ఫిర్యాదు చేస్తే హాస్టల్ నడిపేందుకు అనుమతి ఉందని చెప్పగా.. యాజమాన్యం మాత్రం ఎలాంటి అనుమతి లేదని చెప్పడం గమనార్హం అన్నారు. ఈ క్రమంలో కళాశాల యాజమాన్యం తమతో రూ.2 లక్షలు డీఐఈఓ లంచం తీసుకున్నారని, అందుకే కళాశాల వద్దకు డీఐఈఓ రారని యాజమాన్యం చెప్పారని ఆరోపించారు. డీఐఈఓ కార్యాలయం వద్ద కూడా ఆయన అందుబాటులో లేరని, అనుమతులు లేని కళాశాలలకు అనుమతి ఉందని డీఈఐఓ చెప్పడం ఆయన అవినీతికి పరాకాష్ట అని పేర్కొన్నారు. వెంటనే కలెక్టర్ స్పందించి ప్రైవేట్ కళాశాలలకు తొత్తులుగా మారిన డీఐఈఓ శ్రీధర్ సుమన్‌ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

కారు బోల్తా : నలుగురికి గాయాలు



శాంతినగర్: రాజోళి నుంచి శాంతినగర్‌కు వస్తున్న కారు ఆదివారం సాయంత్రం వడ్డేపల్లి సమీపంలోని కల్వర్టు వద్ద అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న నలుగురు గాయాలపాలయ్యారు. ఘటన స్థలాన్ని శాంతినగర్ ఎస్‌ఐ సంతోష్ పరిశీలించి వివరాలు సేకరిస్తున్నారు.

కేసు నమోదు

ఉండవెల్లి: మండలంలోని పుల్లూరు టోల్‌ప్లాజా సమీపంలోని గొల్ల మల్లికార్జున్ (41) శనివారం పంట పొలంలో చెట్టుకు ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడిన సంగతి విధితమే. ఆదివారం భార్య గొల్ల సోమాదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు.

రూ.30కే ప్రాణం తీయాలని..



వివరాలు వెల్లడిస్తున్న సీఐ స్వామిగౌడ్

- సిగరెట్ డబ్బులు అడిగినందుకు కత్తులతో హత్యాయత్నం
- దాడి ఘటనలో నలుగురు అరెస్ట్

మహబూబ్‌నగర్ క్రైం: పాన్ షాప్‌లో తీసుకువెళ్లిన రూ.30విలువ చేసే సిగరెట్ డబ్బులు ఇవ్వాలని అడిగినందుకు .. ఏకంగా షాప్ నిర్వాహకుడిని కత్తులతో హత్య చేయాలని పథకం రచించారు. కత్తులతో జరిగిన ఘటనపై నేరస్తులను టూటౌన్ పోలీసులు అరెస్టు చేశారు. వివరాలను ఆదివారం టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో సీఐ స్వామిగౌడ్ వెల్లడించారు. ఈనెల 21న సాయంత్రం 5గంటల ప్రాంతంలో పట్టణంలోని న్యూటౌన్‌లో ఉన్న నవాబ్ పాన్ షాప్‌లో వీరన్నపేటకు చెందిన షాహీల్, ఖలీల్ కలిసి రూ.30విలువ చేసే సిగరెట్స్ తీసుకుని వెళ్తుంటే దుకాణంలో ఉన్న ఫయాజ్ డబ్బులు ఇవ్వాలని అడిగితే ఫయాజ్‌ను బెదిరించి వెళ్లారు. ఆ తర్వాత రాత్రి 7గంటల ప్రాంతంలో షాహీల్, అమేన్, ఖలీల్, సమీర్ వీరన్నపేటలోని మహ్మద్ జమీరుద్దీన్ అలియాస్ అడ్డు ఇంట్లో ఉన్నారు. అదే సమయంలో పాన్‌షాప్ యజమాని అవేజ్ సిగరెట్ తీసుకువెళ్లిన షాహీల్‌కు ఫోన్ చేసి మా షాప్‌కు వచ్చి సిగరెట్లు తీసుకుని డబ్బులు ఇవ్వకుండా బెదిరించి వెళ్లావ్ అంటూ అడిగాడు. వెంటనే రూ.30ఫోన్ పే చేయాలని చెప్పాడు. దీంతో షాహీల్ అతని స్నేహితులు కలిసి నీ షాప్ దగ్గకు వచ్చి అంతు చూస్తానని బెదిరించాడు. ఆ తర్వాత పథకం ప్రకారం అవేజ్‌ను హత్య చేయాలని నిర్ణయించుకున్నారు. దీంతో ఖలీల్ తన వద్ద ఉన్న రెండు కత్తులు, రెండు తల్వార్లు తీసుకుని వస్తాను మీరు న్యూటౌన్‌కు రావాలని చెప్పాడు. ఆ తర్వాత ఐదుగురు కలిసి న్యూటౌన్‌లో ఉన్న పాన్‌షాప్ వద్దకు వెళ్లి అవేజ్‌ను మమ్మల్ని డబ్బులు అడుగుతావా అంటూ బూతులు తిడుతూ నిన్ను చంపుతామంటూ దాడి చేయడానికి వెళ్తే అవేజ్ అన్న సలాం అడ్డురాగా అతనిపై దాడి చేశారు. ఆ తర్వాత అవేజ్‌ను కత్తులతో పొడవడానికి ప్రయత్నింస్తుంటే అక్కడే ఉన్న సోఫియాన్ బిన్ సయ్యద్ అడ్డురావడంతో అడ్డు, సమీర్‌లు, అమేన్, ఖలీల్ కత్తులతో దాడి చేయడంతో ఎడమ మోచేతి, నడుము, గొంతు వద్ద గాయాలు అయ్యాయి. అప్పటికే జనాలు అధికంగా రావడంతో ఐదుగురు అక్కడి నుంచి పరారైనట్లు సీఐ వెల్లడించారు. ఇందులో ఏ4 ఖలీల్ పరారీలో ఉన్నాడని మిగిలిన ఏ1 అమేన్, ఏ2 అడ్డు, ఏ3 షాహీల్, ఏ5 సమీర్‌లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వెల్లడించారు. వారి నుంచి రెండు కత్తులు, రెండు తల్వార్లు స్వాధీనం చేసుకున్నామన్నారు.

జూరాలకు స్వల్పంగా వరద

ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వస్తున్న వరద తగ్గుముఖం పట్టినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. ఆదివారం 822 క్యూసెక్కుల వరద వస్తుండగా.. నెట్టెంపాడు ఎత్తిపోతల పథకానికి 750 క్యూసెక్కులు, భీమా లిఫ్ట్–1కు 650, కోయిల్‌సాగర్‌కు 315, భీమా లిఫ్ట్–2కు 715, సమాంతర కాల్వకు 822, ఆవిరి రూపంలో 140 మొత్తం 2,674 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు వివరించారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 9.657 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 8.670 టీఎంసీలు ఉన్నట్లు పేర్కొన్నారు.

రామన్‌పాడులో నిలకడగా..

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయంలో నీటిమట్టం నిలకడగా ఉంది. ఆదివారం జలాశయంలో 1,019 అడుగుల నీటిమట్టం ఉందని.. జూరాల ఎడమ కాల్వ ద్వారా నీటి సరఫరా లేదని, సమాంతర కాల్వ ద్వారా 822 క్యూసెక్కులు జలాశయానికి చేరుతుందని ఏఈ సింగిరెడ్డి రనీల్‌రెడ్డి తెలిపారు. జలాశయం నుంచి ఎన్టీఆర్ కాల్వకు 300 క్యూసెక్కులు, వివిధ లిఫ్టులకు 715 క్యూసెక్కులు, తాగునీటి అవసరాలకు 20 క్యూసెక్కులు వినియోగిస్తున్నామని చెప్పారు.

శ్రీశైలంలో 815.0 అడుగులు..

దోమలపెంట: శ్రీశైలం జలాశయంలో ఆదివారం 815.0 అడుగుల నీటిమట్టం, 37.3540 టీఎంసీల నీటి నిల్వ ఉంది. సుంకేసుల నుంచి 453 క్యూసెక్కుల వరద జలాశయానికి చేరుతుండగా.. 66 క్యూసెక్కుల నీరు ఆవిరైంది.


జూరాల ప్రాజెక్టులో ప్రస్తుత నీటిమట్టం

బాధిత కుటుంబానికి న్యాయం చేయాలి


చికిత్స పొందుతున్న ఈశ్వరమ్మను పరామర్శిస్తున్న సీపీఐ నాయకులు

నాగర్‌కర్నూల్‌రూరల్: గిరిజన చెంచు మహిళ ఈశ్వరమ్మపై దాడికి పాల్పడిన దుండగుల ఆస్తిని జప్తు చేసి, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.బాల్‌నర్సింహ అన్నారు. జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఈశ్వరమ్మను ఆదివారం పరామర్శించారు. అనంతరం డాక్టర్‌లతో ఆమె ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అత్యంత పాశవికంగా ఈశ్వరమ్మపై దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. సమాజంలో ఇలాంటి దుర్మార్గమైన ఘటనలు మరోమారు జరగకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలన్నారు. ప్రత్యేక ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ఏర్పాటుచేసి, 3 నెలల్లోగా దోషులను శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈశ్వరమ్మ కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందన్నారు. సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు హెచ్.ఆనంద్‌జీ, కేశవులుగౌడ్, బార్ల వెంకటయ్య, కార్యదర్శి ఎస్ఎండీ ఫయాజ్, తుమ్మల శివుడు, జంగం శివుడు, దళిత హక్కుల పోరాట సమితి జిల్లా కార్యదర్శి బండి లక్ష్మి, మారేడు శివశంకర్, శివకుమార్ తదితరులు ఈశ్వరమ్మను పరామర్శించారు.

రావూరి వనజకు ప్రమిలా శక్తిపీఠ పురస్కారం


రావూరి వనజకు సాహితీ పురస్కారం ప్రదానం చేస్తున్న ప్రముఖులు

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లాకు చెందిన ప్రముఖ రచయిత్రి, తెలంగాణ రాష్ట్ర సాహితీ సాంస్కృతిక సంస్థ అధ్యక్షురాలు రావూరి వనజ ప్రమిలా శక్తి పీఠం ఆధ్వర్యంలో సాహితీ పురస్కారం అందుకున్నారు. హైదరాబాద్ పద్మారావునగర్‌లోని శివానందాశ్రమంలో ఆదివారం జరిగిన ఓ కార్యక్రమంలో సాహితీ రంగానికి విశేష సేవలు అందిస్తున్న రావూరి వనజకు సంస్థ అధ్యక్షుడు ఆచార్య మసనచెన్నప్ప ప్రమిలా శక్తిపీఠం సాహితీ పురస్కారం మెమోంటో, ప్రశంసాపత్రంతోపాటు రూ.10 వేల నగదు పారితోషికం అందజేసి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జాతీయ సాహిత్య పరిషత్ అధ్యక్షుడు ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి, ప్రముఖ సాహితీవేత్త, సినీ కవి జొన్నవిత్తుల రామలింగేశ్వర రావు, బైసదేవదాసు, గూడూరు మహేందర్‌రెడ్డి, సత్యమూర్తి, లక్ష్మీనారాయణ, రావూరి కృష్ణకుమార్, మేకల అనురాధ తదితరులు పాల్గొన్నారు.